మాంజా ఉచ్చులో గద్ద విలవిల..కాపాడిన ఖాకీలు

టీటీఐ ఆవరణలో చైనా మాంజాకు చిక్కుకున్న గద్దను రక్షిస్తున్న ట్రాఫిక్ ఉపకమిషనర్ లక్ష్మి,ఏసీపీ శంకరరాజు. పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు..ఆపదలో ఉన్న ఓ మూగజీవి పట్ల స్పందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.నిషేధిత మాంజా కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ గద్దను సురక్షితంగా కాపాడి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈ ఘటన బేగంపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బేగంపేట ప్రాంతంలో ఓ చెట్టు కొమ్మకు చిక్కుకున్న చైనీస్ మాంజా కారణంగా ఓ గద్ద ఎగరలేక, కొమ్మకు వేలాడుతూ గిలగిలా కొట్టుకోవడం ఆటుగా వెళ్తున్న ట్రాఫిక్ ఉన్నతాధికారుల కంటపడింది. అదనపు డిసిపి లక్ష్మీ, ఏసీపీ శంకర్ రాజు తక్షణం స్పందించారు. ట్రాఫిక్ సిబ్బంది సహాయంతో ఆ గద్దను కిందకు దింపి, దాని రెక్కలకు బలంగా చుట్టుకుపోయిన మాంజా దారాన్ని జాగ్రత్తగా తొలగించి విడిపించారు.దీంతో మంజా నుంచి విముక్తి పొందిన ఆ పక్షి విచ్చుకున్న రెక్కలతో గాలిలోకి ఎగిరింది. పోలీసులు గద్దను రక్షిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు చూపిన చొరవను, సమయస్ఫూర్తిని నెటిజన్లు, జంతు ప్రేమికులు ప్రశంసించారు. కాగా,గద్దను రక్షించిన అనంతరం అధికారులు ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. పక్షులు, వాహనదారులు, పాదచారుల పాలిట యమపాశంగా మారుతున్న నిషేధిత చైనీస్ మాంజాను ఎవరూ వాడవద్దని కోరారు. పర్యావరణ పరిరక్షణ, పక్షుల రక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

హైదరాబాద్ వార్త

దాటడానికి దొంగలు..
పట్టుకోవడానికి పోలీసులు!

- నేపాల్ బార్డర్‌లో పోలీసుల బృందాలు
- ఇతర రాష్ట్రాల హద్దుల్లోనూ నిఘా
- జూబ్లీహిల్స్ దోపిడి ముఠా కోసం కొనసాగుతున్న పోలీసుల వేట



జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్తః చోరీ చేసిన సొమ్ముతో ఎలాగైనా హద్దు(బార్డర్) దాటాలని దొంగలు.. హద్దు దాటక ముందు వారిని చోరీ సొమ్ముతో పట్టుకోవాలని పోలీసులు.. సినిమా కథను తలపించే రీతిలో జూబ్లీహిల్స్‌లో దోపిడికి పాల్పడిన నేపాలీ దొంగల ముఠాను పట్టుకొనేందుకు ఇప్పుడు పోలీసులు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు.. ఎలాగైనా దొంగలను పట్టుకోవాలనే లక్ష్యంతో పోలీసులు విమానాల్లో నేపాల్ సరిహద్దులకు తరలి వెళ్లారు.. మరికొన్ని బృందాలు నగరంతోపాటు చుట్టుపక్కల ఉన్న అనేక రాష్ట్రాల హద్దుల వద్ద పోలీసులు దృష్టి పెట్టారు.

నలుగురి కోసం..

జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో నివసించే రవీంద్ర శర్మ నివాసంలో పనిచేసే భూపేందర్ షాహీ గురువారం రాత్రి దోపిడికి పాల్పడిన విషయం విదితమే. కాగా ఈ సంఘటనలో సీసీటీవీ ఫుటేజీలను, దొంగలు పారిపోయే సమయంలో గుర్తించిన రవీంద్రశర్మ కోడలు, సహాయకురాలి ఆధారంగా మొత్తం నలుగురు నిందితులు ఈ దోపిడికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే జాయింట్ సీపీ శ్వేత పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. ప్రధానంగా నగరంలో భూపేందర్ షాహీని పనిలో కుదిర్చిన నేపాల్ ఏజెంట్ మదన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. భూపేందర్ షాహీ నాగరిక్ కార్డు(ఆధార్ కార్డు)ను పరిశీలించిన పోలీసులు నేపాల్‌లోని దాయ్ చెందిన వారిగా గుర్తించారు. అతనితోపాటు మరో ముగ్గురు ఈ దోపిడిలో పాల్గొన్నట్లు తేల్చడమే కాకుండా వారి పేర్లను, వివరాలను సైతం పోలీసులు సేకరించారు. ప్రధానంగా టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, ఐటీ, డాగ్ స్క్వాడ్ బృందాలు నగరంలోని వివిధ ప్రాంతాలపై దృష్టి పెట్టాయి. ఇప్పటికే రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లతోపాటు ప్రైవేటు టాక్సీలపై పోలీసులు దృష్టి సారించారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను, ముఖ కవలికల ఆధారంగా గుర్తింపును పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా మరికొన్ని బృందాలు పూణే, ముంబై, ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలివెళ్లాయి. నిందితులను ఎలాగైనా పట్టుకోవడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలను చేస్తున్నారు. స్థానికంగా ఉన్న కొందరు నేపాలీలు ఇచ్చిన సమాచారం మేరకు ఐటీ బృందం అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తుంది.

హద్దుల్లో పోలీసులు..

భారత్ నుంచి నేపాల్‌కు ప్రధానంగా కొన్ని సరిహద్దు ప్రాంతాలున్నాయి. రూపేడియా, గోరఖ్‌పూర్, సొనౌలి తదితర సరిహద్దులున్నాయి. అయితే ఈ హద్దుల వద్ద సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బి) సరిహద్దు భద్రతా బాధ్యతలను పర్యవేక్షిస్తుంది. భారత్-నేపాల్ మధ్య ఓపెన్ బార్డర్ ఉండటంతో కొన్ని భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయి. వీసా, పాస్‌పోర్ట్ లేకుండానే రాకపోకలు సాగుతుండటంతో మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాలు, నకిలీ కరెన్సీ, ఆయుధాల తరలింపు ఎక్కువగా జరుగుతుంది. ఈ భద్రతా సమస్యలను నివారించేందుకు ఎస్ఎస్‌బి కాపలా కాస్తుంది. అయితే ఇక్కడ నేరాలకు పాల్పడే నేరస్థులు ఒక్కసారి హద్దు దాటితే వారిని తీసుకొని రావడం చాలా కష్టం. రెండు దేశాల మధ్య అలాంటి ఒప్పందాలు లేకపోవడంతో ఇప్పుడు నగర పోలీసు బృందాలు చోరి జరిగిన వెంటనే విమానాల్లో నేపాల్ సరిహద్దులకు చేరుకున్నాయి. దాదాపు మూడు, నాలుగు బృందాలు వివిధ హద్దులో ఉన్న ఎస్ఎస్‌బి అధికారుల సమన్వయంతో నేరస్థులను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొద్ది నెలల కిందట కాచిగూడ ప్రాంతంలో జరిగిన చోరీ వ్యవహారంలోనూ ఇలానే నేపాల్‌కు చెందిన దొంగలు హద్దులు దాటి వెళ్లడంతో పోలీసులు రికవరీ చేయడం చాలా కష్టంగా మారింది. దీనికితోడు నేపాల్ పోలీసులు సైతం పెద్దగా సహకరించకపోవడంతో హద్దులు దాటకముందే వారిని పట్టుకోవడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

మార్చిలో అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్

-త్వరలో 100 మంది వైద్య, పారామెడికల్ సిబ్బంది నియామకం

-పరికరాల ఏర్పాటు, ట్రయల్ రన్స్ ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త హైదరాబాద్ నగరంలోని సనత్‌నగర్‌లో నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మార్చి నెలలో ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేసింది. ముఖ్యమంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రి ఆదేశాల మేరకు రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సనత్‌నగర్ లోని ఆసుపత్రిని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. అన్ని పనులను ఫిబ్రవరి 28వ తేదీలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన గడువు విధించారు.వైద్య విద్య డైరెక్టర్, టీజీఎంఎస్ ఐడీసీ, ఎంహెచ్ఐడీసీ, ఆర్అండ్‌బీ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులతో కలిసి ఆయన ఆసుపత్రిలోని అన్ని అంతస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు.ఈ నెలాఖరులోగా 200 ఆక్సిజన్ లైన్లు, 65 నర్సింగ్ స్టేషన్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఎమర్జెన్సీ వార్డు కోసం ఆర్వో ప్లాంట్ వంటి కీలక పనులను పూర్తి చేసి ట్రయల్ రన్స్‌కు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా లాండ్రీ సేవలు, కర్టెన్లు, ఐసీయూ బెడ్ రైలింగ్స్, ఆసుపత్రి అంతటా సైన్ బోర్డులు వంటివి ఏర్పాటు చేయాలని ఎంహెచ్ఐడీసీని ఆదేశించారు. తమ పరిధిలోని వైద్య పరికరాలన్నీ ఇప్పటికే అమర్చినట్లు నిర్మాణ సంస్థ తెలపగా, మరో 540 రకాల వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని ఎంహెచ్ఐడీసీ అధికారులు వివరించారు.ఆసుపత్రి కార్యకలాపాలను ప్రారంభించేందుకు వీలుగా, పరికరాల ట్రయల్ రన్స్ పర్యవేక్షణకు వెంటనే వైద్య, సాంకేతిక సిబ్బందిని నియమించాలని వైద్య విద్య డైరెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన, మొదటి విడతలో 100 మంది వైద్య, పారామెడికల్, హౌస్‌కీపింగ్ సిబ్బందిని ఫిబ్రవరి 12 నుంచి 28 మధ్య నియమిస్తామని తెలిపారు. ఆసుపత్రి భవనాన్ని ఆరోగ్య శాఖకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటికే 1,059 గదులకు గాను 225 గదులను తనిఖీ చేశామని అధికారులు వెల్లడించారు. తనిఖీ పూర్తయిన గదుల్లో ఫిబ్రవరి 12 నుంచి బెడ్లు, ఇతర పరికరాలను అమర్చనున్నారు.

యువతే మన దేశ వెన్నుముక

-మేరా యువ భారత్ కార్యక్రమాలు అభినందనీయం

-జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

-తమిళనాడు యువతతో సంభాషణ

తమిళనాడు విద్యార్థులతో డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

హైదరాబాద్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త: తమిళనాడులో వివిధ జిల్లాలకు చెందిన 37 మంది యువత శనివారం హైదరాబాద్ కలెక్టరేట్‌ను సందర్శించి, జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారితో సంభాషించారు.ఈ సందర్శన భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మేరా యువ భారత్ కేంద్రం హైదరాబాద్ నిర్వహించిన 5 రోజుల అంతర్రాష్ట్ర యువజన ఎక్చేంజ్ కార్యక్రమం 2026 లో భాగంగా నిర్వహించడం జరిగింది."ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" అనే స్ఫూర్తిదాయక నినాదంతో ఫిబ్రవరి 3 నుండి 7వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని వారికి పరిచయం చేయడం మరియు శిక్షణా తరగతులు వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో భాగంగా, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ, సైబర్ భద్రత, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన పథకాలు, ఎన్‌డిఆర్ఎఫ్ ద్వారా విపత్తు ప్రతిస్పందన మాక్ డ్రిల్‌పై సెషన్‌లు నిర్వహించి, వారికి వివిధ రంగాలలో జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడం జరిగింది. వారికి బిర్లా మందిర్, బిర్లా సైన్స్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ కోట, సాలార్జంగ్ మ్యూజియం, నాంపల్లి ఎగ్జిబిషన్, ఎన్ఐఆర్‌డి గ్రామీణ సాంకేతిక పార్క్ మరియు రాష్ట్రపతి నిలయం వంటి హైదరాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలను కూడా సందర్శింపజేశారని జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు.ఈ సందర్భంగా ఈ ప్రోగ్రామ్ లో పాల్గొన్న యువత తమ అనుభవాలను జిల్లా రెవెన్యూ అధికారితో పంచుకున్నారు. ఆయన వారిని అభినందించి, యువతే మన దేశానికి వెన్నెముక అని ఉద్ఘాటించారు. మన దేశంలోని విభిన్న సంస్కృతులను వారికి పరిచయం చేస్తూ, నైపుణ్యాలను అందిస్తున్న ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించినందుకు మై భారత్ హైదరాబాద్‌ను ఆయన ప్రశంసించారు. సాంప్రదాయ మార్షియల్ ఆర్ట్ అయిన సిలంబట్టంతో సహా తమిళనాడు సంస్కృతిని ప్రతిబింబించే ఉత్సాహభరితమైన ప్రదర్శనతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా, కార్యక్రమ పర్యవేక్షకుడు ఈ. యాదగిరి మై భారత్ వాలంటీర్లు డి. మనోజ్ ఖన్నా, శివ కుమార్, తరుణ్, ప్రకాష్, జగన్ మరియు తమిళనాడుకు చెందిన యువ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రేమ నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య



మృతిచెందిన వంశీకృష్ణ(పాతచిత్రం)

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్తః తన ప్రేమను నిరాకరించిందని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ లోని మాచర్ల ప్రాంతానికి చెందిన సుంకర వంశీ కృష్ణ(27) తన సోదరి ప్రీతితో కలిసి యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో పెద్దమ్మ సంధ్య వద్ద నివసిస్తున్నారు. డ్రైవర్‌గా, రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న వంశీకృష్ణ గత కొంత కాలంగా ఒక యువతిని ప్రేమించాడు. అయితే యువతి అతని ప్రేమను నిరాకరించడంతో 20 రోజుల క్రితం మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి అతన్ని ఆసుపత్రికి తరలించడంతో బ్రతికి బయటపడ్డాడు. దీంతో కొద్ది రోజులుగా వంశీకృష్ణ మనో వేదనతో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం సొంతూరైన మాచర్లకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వంశీకృష్ణ శనివారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాచర్ల నుంచి ఉదయం మాచర్ల నుంచి వచ్చి తలుపు తట్టగా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూశారు. అనంతరం ఇరుగుపొరుగు సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే వంశీకృష్ణ మృతిచెందాడు. దీంతో స్థానికులు జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రాథమికంగా అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఉప్పల్ ఎసిపి వై.వెంకటరెడ్డి, సిఐ వై.రామలింగారెడ్డి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఒక పాత నేరస్థుడిని ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఉప్పల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పల్ ఎసిపి వై. వెంకట్‌రెడ్డి, డిఐ వై.రామలింగారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ వాసవినగర్‌కు చెందిన తల్లా రాఘవేందర్ అలియాస్ శ్రీనివాస్‌గౌడ్, అలియాస్ దక్కలి రమేష్, అలియాస్ శ్రీను (36) అనే వ్యక్తి గతంలో పలు నేరాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. అయితే ఈనెల 5వ తేదిన ఉదయం రామంతాపూర్‌కు చెందిన గుంటి మల్లమ్మ ఇంట్లో పగటి వేళ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న సుమారు 85 గ్రాముల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీ చేసుకుని పరారైనట్లు తెలిపారు. దీంతో పోలీసులు పలు కోణాలలో విచారణ చేసి 24 గంటలలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.14 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో షాబాద్, షాద్‌నగర్, నార్సింగి, అంబర్‌పేట పిఎస్ పరిధిలో చోరీ కేసులో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. సకాలంలో కేసు చేదించిన ఉప్పల్ పోలీసులును ఉన్నతాధికారులు అభినందించారు. పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆధ్వర్యంలో ఉప్పల్ డిసిపి కె.సురేష్‌కుమార్,అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఎసిపి వై.వెంకట్‌రెడ్డి, సిఐ కె.భాస్కర్,డిఐ వై.రామలింగారెడ్డి, డిఎస్ఐ రజనీకర్‌రెడ్డి, ఎఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ జంగయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ నెట్‌వర్క్ మరింత బలోపేతం

-డిమాండ్‌కు తగ్గట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు

-టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ

పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సిఎండీ ముషారఫ్ ఫరూఖీ, డైరెక్టర్ డా.నర్సింహులు, మెట్రోజోన్ సిఈ ప్రభాకర్, ఎస్ఈ గోపయ్య తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త: సికింద్రాబాద్ సర్కిల్ పారడైజ్ డివిజన్ పరిధిలోని సీతాఫల్‌మండి సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 16 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) చైర్మన్, సిఎండీ ముషారఫ్ ఫరూఖీ శనివారం ప్రారంభించారు. ఈమేరకు శనివారం సీతాఫల్‌మండిలోని సబ్‌స్టేషన్‌కు డైరెక్టర్ నర్సింహులుతో కలిసి వెళ్ళి స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన సిఎండి విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం లక్ష్యంగా సంస్థ పరంగా నూతన సబ్ స్టేషన్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు నిరంతరంగా చేపడుతున్నామని తెలిపారు. రాబోయే వేసవి కాలంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలన్నారు. అదేవిధంగా, విద్యుత్ పనుల నిర్వహణలో సిబ్బంది భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు గోపయ్య, దిలీప్ కుమార్ ఇతర ఇంజినీర్లు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మా చెరువులను అభివృద్ధి చేయండి..

-ఆక్రమణల భరతం పట్టండి

-"హైడ్రా ఫోన్ ఇన్ "లో కమిషనర్‌ను కోరిన నగర ప్రజలు

-దశలవారీ చేపడుతున్నామన్న కమిషనర్ రంగనాథ్

ఫోన్‌ఇన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త: "మా చెరువులో మురుగు నీరు వచ్చి చేరుతోంది దుర్గంధభరిత వాతావరణంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. గుర్రపు డెక్కపెరిగి దోమలతో కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నాం. పగలూ, రాత్రి అనే తేడా లేకుండా కిటికీలు, తలుపులు బంద్ చేసుకోవాల్సిన పరిస్థితి. మా చెరువుల్లో మురుగు నీరు కలవకుండా చూడండి.. మా చెరువులను కూడా అభివృద్ధి చేయండి"అంటూ పలువురు నగర వాసులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. ఈమేరకు శనివారం ఫోన్ ఇన్ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ పాల్గొనగా నగర ప్రజలు పలు సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రజావాణికి అదనంగా శనివారం నాడు ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషమని అభినందించారు. హైడ్రా కార్యాలయం వరకూ రాలేనివారు.. సమస్యలను ఫోనులో చెప్పుకునే అవకాశం ఇవ్వడం సంతోషమన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ జరిగిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో నేరుగా కమిషనర్ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. వారి సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారి వివరాలను అందజేశారు. వారం తర్వాత పరిష్కారం కాకుంటే నేరుగా తనకు ఫోను చేయాలని ఫిర్యాదుదారులను కోరారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి శనివారం 040-29565750, 040-29565759 ఈ నంబర్లకు ఫోను చేసి సమస్యలను తెలియజేయాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి కూడా కొన్ని ఫోన్లు వచ్చాయి. అక్కడ కూడా చెరువులు ఆక్రమణలకు గురౌతున్నాయని.. వాటిని కాపాడాలని పలువురు కోరారు. ఓఆర్ఆర్ వరకే హైడ్రా పరిధి అంటూ.. వారికి కమిషనర్ సర్ది చెప్పారు. మొదటి విడత 6 చెరువులు చేపట్టగా.. త్వరలోనే 14 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఇలా దశలవారీ చెరువులను అభివృద్ధి చేస్తున్నామని హైడ్రా కమిషనర్ వారికి తెలిపారు.

ఆక్రమణల భరతం పట్టండి..

చెరువులు సహజ లక్షణాలను కోల్పోయాయని వాటిని పునరుద్ధరించాలని ఎక్కువ మొత్తంలో ఫిర్యాదులందాయి. పార్కులు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయని, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురై.. నడక దారి లేకుండా చేస్తున్నారంటూ ఫిర్యాదులు అందాయి. దుండిగల్ మున్సిపాలిటీలోని గాగిలాపూర్‌లో రహదారులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ప్రగతి నగర్ వద్ద ఓపార్కులో ఆలయం కట్టడానికి ప్రయత్నిస్తున్నారని, నాగిరెడ్డి కుంటలోకి మురుగు నీరు చేరకుండా డైవర్ట్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయని.., మాధాపూర్‌లోని సున్నం చెరువు వద్ద పేరుకు వంద అడుగుల రహదారి ఉన్నా.. మొత్తం నీటి ట్యాంకర్లతో ఆ రోడ్డు అంతా రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఫోనులో ఆయా ప్రాంతాల నుంచి ఫిర్యాదులందాయి. బడా నిర్మాణ సంస్థలకు చెందిన వారు.. వరద కాలువలను దారి మళ్లించడమే కాకుండా కబ్జాలకు పాల్పడుతున్నారని పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదులందాయి. అత్తాపూర్‌లో 33 గుంటల ప్రభుత్వ భూమితో పాటు.. 900 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని.. అక్కడ నిర్మాణాలు రాకముందే అడ్డుకోవాలని సూచించారు.

ఆక్రమణదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని కోరారు. ఇలా శనివారం కార్యక్రమంలో 36 మందితో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌మాట్లాడి వారి సంస్యలు తెలుసుకున్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభసభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

గాంధీనగర్ లో రూ.70 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తో కలిసి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

చిక్కడపల్లి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ లోని రూ.70 లక్షలతో నిర్మించతలపెట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, రాజ్య సభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తో కలిసి కేంద్రం బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. డివిజన్ పరిధిలో రూ.30 లక్షలతో జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ 2 వ అంతస్తు నిర్మాణం, రూ.14 లక్షలతో సంజీవయ్య నగర్ బస్తీ కామ్యూనిటీ హాల్ బ్యాలెన్స్ పనులు, ఎంపీలాడ్స్ నిధులతో , రూ. 26 లక్షలతో జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ రిపేర్ పనులను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రా బాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ పి. పావని వినయ్ కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్, బి ఆర్ ఎస్ యువనేత ముఠా జయసింహ, జి హెచ్ ఎంసి కవాడి గుడా సర్కిల్ డిఎంసి ఆర్. పుష్పాలత, ముషీరాబాద్ ఎమ్మార్వో రాణా ప్రతాప్ సింగ్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, దామోదర్, విఎస్టి రాజు, మహమూద్,ఆనంద్ రావు,సాయికుమార్,అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, సంతోష్,నీరజ్,శేషికాంత్, బిఆర్ ఎస్ నేతలు ముఠా నరేష్, రాకేష్, ముచకుర్తి ప్రభాకర్ ,కాంగ్రెస్ నేతలు మారిశెట్టి నరసింగ రావు, గుండు జగదీష్, స్థానికులు, అన్ని శాఖల అధికారులు బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

వృద్ధురాలిని ఆశ్రమానికి తరలించిన అధికారులు

రహిమబిని అమర ఫౌండేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

కూకట్‌పల్లి పరిధిలో దీన్ దయాల్ నగర్ బస్తీలో గత ఐదు సంవత్సరాలుగా రహిమబి(60) ఈమె ఒక నిరాశ్రయురాలు ఆరోగ్యం మంచిగా ఉన్నన్ని రోజులు కాయ కష్టం చేసుకుని ఇదే బస్తీలో ఒక ఇంట్లో అద్దె చెల్లించుకుంటూ జీవనం కొనసాగిస్తుండేది. గత ఐదు సంవత్సరముల కింద పూర్తిగా ఆరోగ్యం క్షీ ణించడం వలన ఆమె ఇంట్లోనే ఉండడం జరిగింది. సరైన ఆదాయం లేక దీంతో అద్దె డబ్బులు చెల్లిస్తా లేదని ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. దిక్కుతోచని స్థితిలో అదే బస్తీలో రోడ్లపైనే నిద్రిస్తూ అక్కడి స్థానిక ప్రజలు పెట్టింది తింటూ అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతుంది. బస్తి వారు చెప్పిన దాని ప్రకారం వర్షానికి ఎండకు రోడ్డుపైనే పడుకునేది. బస్తీ వారు ఈమె దీన పరిస్థితిని చూడలేకపోతున్నాం అని తీసుకెళ్లి ఏదైనా ఆశ్రమంలో పెట్టండని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ పావన్న గౌడ్ పరిస్థితి కూకట్‌పల్లిలో గల అమర ఫౌండేషన్ వారి దృష్టికి తీసుకువెల్లగా వారు వృద్ధురాలిని అమర ఫౌండేషన్ ఆశ్రమంలో చేర్చుకున్నారు. దీంతో అధికారి చేసిన పనికి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నాగార్జున విద్యాలయలో ఘనంగా గ్రీన్ డే వేడుకలు

గ్రీన్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్లో గల శ్రీ నాగార్జున విద్యాలయంలో శనివారం గ్రీన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తుల్లో పాఠశాలలో కనిపించి కనువిందు చేశారు. గ్రీన్ డే సందర్భంగా పాఠశాలలో మ్యాజిక్ షో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ జె. కమలాకర్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ జే.అనురాధ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలల వార్షిక పరీక్షల నోటిఫికేషన్ విడుదల

: విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఎం.వి.ఆదిలక్ష్మి

నాంపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు / పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను రెగ్యులర్/ ప్రైవేట్ విద్యార్థులకు సర్టిఫికెట్, డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారిణి ఎం. వి.ఆదిలక్ష్మి విడుదల చేశారు. ఈ పరీక్షలకు తెలంగాణ రాష్ట్రంలో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన అర్హులైన ప్రైవేట్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. వివిధ కోర్సుల పరీక్ష ఫీజు వివరాలు, ప్రైవేట్ / రెగ్యులర్ అభ్యర్థి ఆధారంగా నిర్ణయించబడతాయని, దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆలస్య రుసుము లేకుండా 10 మార్చి 2026 వరకు; వెయ్యి రూపాయల ఆలస్య రుసుముతో 30 మార్చి 2026 వరకు సమర్పించవలసి ఉంటుందని, 2026 మార్చి / ఏప్రిల్ నెలల్లో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు పిఎస్‌టియుసెట్.ఆర్గ్ (ఓఆర్‌జీ) / తెలుగుయూనివర్సిటీ.ఏసి.ఇన్ వెబ్‌సైట్‌లను దర్శించవచ్చని, అంతేకాక తెలుగు విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం 8143165646 మొబైల్ నంబరులో సంప్రదించవచ్చని ఎం.వి.ఆదిలక్ష్మి తెలిపారు.

12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంచుతున్న సీఐటియూ నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: ఫిబ్రవరి 12వ తేదీ జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెనె జయప్రదం చేయాలని సీఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం అంబర్‌పేట్‌లోని మున్సిపల్ వర్కర్ల ఆజర్ పాయింట్‌ల వద్ద కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చి, కార్మికులకు బతుకు తెరువు లేకుండా చేసిందని ఆరోపించారు. ఫిబ్రవరి 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం అంబర్‌పేట్ సర్కిల్ డిఈ రఘుప్రసాద్‌కు సమ్మె నోటీస్ అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం.దశరథ్, నగర ఉపాధ్యక్షులు జి.రాములు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అంబర్‌పేట్ జోన్ కన్వీనర్ పి.శ్రీనివాస్, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గౌలిగూడలో తాగునీరు,సీవరేజ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఆనంద్ కుమార్‌గౌడ్

పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌గౌడ్

బేగంబజార్,ఫిబ్రవరి7ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు.జలమండలి మేనేజర్ కులశేఖర్‌తో కలిసి గౌలిగూడ తదితర బస్తీల్లో ఆయన అధికారులు,స్థానిక ప్రజలతో కలిసి పాదయాత్ర చేశారు. ఈసందర్భంగా ఆయన స్థానిక ప్రజలు మంటినీటి,డ్రైనేజీ సమస్యతో ఇబ్బందుల పడుతున్నట్లు ఆయనకు విన్నవించారు. పాదయాత్రలో ఉన్న జలమండలి మేనేజర్ కులశేఖర్‌కు బస్తీలో సీవరేజీ,మంచినీటి సమస్యలను చర్యలు చేపట్టాలని కోరారు.దీంతో స్పందించిన వాటర్‌వర్క్స్, మేనేజర్ కులశేఖర్ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.తాను 35ఏళ్ల నుంచి ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.ప్రజలు కూడాఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

విబి జీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి : మోతె రోహిత్, జగన్

హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతె రోహిత్ డిమాండ్ చేశారు. శనివారం అంబర్‌పేట, పటేల్‌నగర్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ పులి జగన్ అధ్యక్షతన జరిగిన సత్యాగ్రహ దీక్షా శిబిరం నుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉపాధి హక్కు, పంచాయతీలకు పాలనా హక్కులు తిరిగి కల్పించాలన్నారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో, నేడు రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పబోతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ పులి జగన్ మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి పార్టీల తప్పుడు విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంజాయతీలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన అధికారాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మన్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు పి.నారాయణస్వామి, దిడ్డి రాంబాబు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు

పటేల్‌నగర్‌లో జరిగిన కాంగ్రెస్ సత్యగ్రహ దీక్ష శిబిరం నుద్దేశించి మాట్లాడుతున్న మోతె రోహిత్, చిత్రంలో పులి జగన్ తదితరులు

గరిగంటి రమేష్, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పి.రామ్మోహన్‌రావు, మహ్మద్ ఫరీద్, ప్రభాకర్, షేక్ జమీర్,జహింగీర్, సిహెచ్ సుధాకర్, నాగేష్‌గౌడ్, మురళీకృష్ణ, వెంకటేష్, లక్ష్మన్, శ్రీకాంత్, అబ్బు, అంబర్‌పేట డివిజన్ నాయకులు షేక్ అలీం, శ్రీనివాస్‌రెడ్డి, అఖీల్, షాబాజ్ అలం, ముంతాజ్, యూసుఫ్,ఆర్టీసి పాషా, హజీ, అజ్జు, హుస్సేన్, కరీం, నజీర్, రఘు, సాజిత్, రాజు, శ్రీనివాస్, దేవి, జబీన్, శాంతమ్మ, ఫాతిమా, సునితరెడ్డి, లావణ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పఠనాసక్తి, పరిశోధన విద్యార్థులకు ఎంతో ముఖ్యం : రచయిత డా దినేష్ సి శర్మ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:

విద్యార్థులకు పఠనాసక్తి, పరిశోధన ఎంతో ముఖ్యమని, అది విద్యార్థి భవిష్యత్తును మారుస్తుందని ప్రముక రచయిత డాక్టర్ దినేష్ సి శర్మ అన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్) పాఠశాలలో అధునాతన గ్రంథాలయం, పుస్తక పఠనంపై విద్యార్థులకు శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్ సి శర్మతోపాటు మరో రచయిత ప్రేమ్ అమన్, ది హిందూ పత్రిక మాజీ సంపాదకులు వెంకటేశ్వర్లు, జేహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మురళీముకుంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేష్ సి శర్మ మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల ఆలోచన సరళి మారుతుందన్నారు. వారిలో కొత్త ఆలోచనలు రేకెత్తించడానికి ఎంతగానో ఉపయోడపతుందన్నారు. ప్రేమ్ అమన్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు ఇతర టెక్నాలజీతో కూడిన పరికరాలు కళ్లను, ఆరోగ్యాన్ని దెబ్బతిస్తాయని, పుస్తక పఠనం వల్ల మెదడు మరింత చురుగ్గా మారుతుంద

డాక్టర్ దినేష్ సి శర్మకు బహుమతిని అందిస్తున్న మురళీముకుంద్.

న్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పఠనం ద్వారా ఉత్సుకత, కుశాగ్రబుద్ధి, ఇతర గ్రంథాలను చదవడం అలవడుతుందన్నారు. మురళీముకుంద్ మాట్లాడుతూ డాక్టర్ దినేష్ సి శర్మ వైజ్ఞానిక రచయితగా, జర్నలిస్టుగా, పుస్తక రచయితగా చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ ఎం. వరలక్ష్మి, ప్రిన్సిపల్ కాంచనవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పల్ మెట్రో డిపోలో సౌరవిద్యుత్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : మెట్రో రైల్ రెండవ సౌరవిద్యుత్ ప్లాంట్‌ను ఉప్పల్ మెట్రో డిపోలో ఎల్ అండ్ టి మెట్రో రైల్ సంస్థ 1.2 మెగావాట్ల సామర్థం సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఉప్పల్ మెట్రో డిపోలో డీవీఎస్ రాజు ప్రారంభించారు. ఈ పవర్ ప్లాంట్ మంజూరు కోసం చీఫ్ ఈఐజి (భారత ప్రభుత్వం)కి ఎల్ అండ్ టీ మెట్రో దరఖాస్తు సమర్పించింది. ఈ మేరకు ఈ ప్రాజెక్టును ఆమోదించి, శనివారం ప్రారంభించారు. ఎల్ అండ్ టి మెట్రో సీఓఓ సుధీర్ చిప్లుంకర్, కియోలిస్ హైదరాబాద్ ఎండిఆర్‌టిఎస్ ఎండి ఎస్.సి. మిశ్రా ,హెచ్ ఎంఆర్ఎల్, ఎల్ అండ్ టి మెట్రో, కియోలిస్ సంస్థల ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవీఎస్ రాజు 0.8/33కేవీ అవుట్‌డోర్ సహాయక సబ్‌స్టేషన్‌తో పాటు సౌర విద్యుత్ ప్లాంట్‌ను కూడా పరిశీలించారు.అదనంగా 1.2 మెగావాట్ల ప్లాంట్‌ను ప్రారంభించడంతో, మొత్తం విద్యుత్ వినియోగంలో పర్యావరణ హిత ఇంధనం వాటా ఇప్పుడు సుమారు 16 శాతానికి పెరిగింది. మెట్రో రోలింగ్ స్టాక్‌కి సంబంధించిన వివిధ భాగాలలో లోపాలను విశ్లేషించడానికి ఎల్ అండ్ టి

మెట్రో రైల్ రెండవ సౌరవిద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ ఈఐజి (కేంద్ర ప్రభుత్వం) డీవీఎస్ రాజు

మెట్రో రైల్ అభివృద్ధి చేసిన అధునాతన సాంకేతిక ఏర్పాట్లను రాజు పరిశీలించారు. రైలు సేవలకు అంతరాయం కలగకుండా తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. హైదరాబాద్ నగరానికి నిరంతరాయంగా, అత్యంత విశ్వసనీయమైన మెట్రో కార్యకలాపాలను అందించడానికి, వైఫల్యాలకు ఆస్కారం లేకుండా నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు.

ప్రైవేటు ఏజెన్సీల ఆగడాలను అరికట్టాలంటూ ఆందోళన

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: రవాణా వ్యవస్థలో ప్రైవేటు ఏజెన్సీల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయం వద్ద క్యాబ్ డ్రైవర్స్ నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ యూనియన్ల పిలుపుమేరకు శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున క్యాబ్ డ్రైవర్లు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం ఓలా, ఉబర్ వంటి సంస్థల వల్ల డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల సంపదలో 40 శాతం ప్రైవేటు ఏజెన్సీలు దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సతీష్ కుమార్, అజయ్‌బాబు, కిరణ్‌కుమార్, సిద్దార్థగౌడ్‌లు మాట్లాడుతూ క్యాబ్ డ్రైవర్లు రోజులో 15 గంటలు కష్టపడుతున్నా కనీసం పూట గడవడానికి ఇబ్బంది నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి పలు మార్లు మొరపెట్టుకున్న ప్రయోజనం లేకుండా పోయిం

ఆందోళన నిర్వహిస్తున్న వివిధ యూనియన్ల డ్రైవర్లు

దని మండిపడ్డారు. రవాణా శాఖ స్థిర ధరలను ప్రకటించాలని, డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, నగరంలో పార్కింగ్ స్థలాలు సూచించాలని డిమాండ్ చేశారు. ఓవైపు పూట గడవని పరిస్థితిలో ఉన్న క్యాబ్ డ్రైవర్లకు పోలీసులు చలానాలతో వేధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వారంతా ప్లకార్డులు, ప్లెక్సీలు పట్టుకొని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారుల నిర్లక్ష్యంతో చిరువ్యాపారులకు అన్యాయం : సిపిఐ

-సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్

నిజాంపేట్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : ప్రగతి నగర్ అంబీర్ చెరువు వద్ద వ్యాపారం చేసుకుంటున్న చిరువ్యాపారులకు అధికారుల నిర్లక్ష్యం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ ఆరోపించారు. అంబీర్ చెరువు అభివృద్ధి పేరుతో చిరువ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. హైడ్రా కమిషనర్‌తో మేము మాట్లాడాం అంటూ కొంతమంది చెప్పడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. హైడ్రా కమిషనర్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కలిగిన అధికారినే తప్ప రాజు కాదన్నారు. అంబీర్ చెరువులో గుర్రపు డెక్కలు విస్తృతంగా పెరిగి దోమల బెడద పెరుగుతోందని తెలిపారు. ఈ సమస్యలపై తొలిసారిగా సిపిఐ ఆధ్వర్యంలోనే నిరసన చేపట్టామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంబీర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పినా ఆ పని పూర్తి కాలేదని విమర్శించారు.

చిరువ్యాపారులకి ప్రత్యామ్నాయ స్థలాలు, సదుపాయాలు కల్పించిన తరువాతే ఖాళీ చే యించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. లేనిప క్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని పాలభిందెల శ్రీనివాస్ హెచ్చరించారు.

దోమల నిర్మూలనకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

నార్సింగి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :

నార్సింగి సర్కిల్ పరిధిలోని నెక్‌నాంపూర్ డివిజన్‌లో ఉన్న చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమల వద్ది కేంద్రంగా మారిందని ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం కార్యదర్శి షేక్ ఆరీఫ్, ఉపాధ్యక్షులు అందె లక్ష్మణ్‌రావ్‌లు పేర్కొన్నారు. శనివారం ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం నెక్‌నాంపూర్ చెరువులోని గుర్రపు డెక్కను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో దోమల బెడద తీవ్రంగా ఉండడంతో తాము స్థానిక ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించామని, అప్పుడు అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించి, దోమల నిర్మూలన చర్యలు చేపట్టారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ పెద్ద ఎత్తున దోమలు వృద్ధి చెంది ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. స్యాంత్రం ఐదు గంటలు దాటిందంటే చాలు ఇళ్లపై గుంపులు, గుంపులుగా దాడి చేసి ప్రజల రక్తంను తాగుతూ, రోగాలను వ్యాపింపచేస్తున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించి, దోమలను నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సుమ నళిని, ప్రతినిధులు అజయ్‌రెడ్డి, రాంచందర్‌రావ్, దిలీప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్‌నాంపూర్ చెరువులో దోమల వృద్ధికి కారణమైన గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం

కేర్ టేకర్‌గా ఉంటూ బంగారం చోరీ...

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

ఇంట్లో కేర్ టేకర్‌గా పని చేసే ఓ వ్యక్తి బంగారం చోరీ చేసి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. కూకట్‌పల్లిలోని రామాలయం రోడ్డులో నివసించే శేష కుసుమ తన భర్తను చూసుకోవడానికి కేర్ టేకర్‌గా శ్రీనివాసులు అనే వ్యక్తిని నియమించింది. గత సంవత్సరం కుసుమ భర్త ఆసుపత్రిలో ఉన్న సమయంలో శ్రీనివాసులు బీరువాలో ఉన్న 53.6 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్ళాడు. అప్పట్లో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా శ్రీనివాసుల్ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. దొంగతనం చేసినట్లు పోలీసుల సమక్షంలో ఒప్పుకోగా నిందితుని వద్ద నుండి బంగారం సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

కన్నులపండువగా శ్రీసంగమేశ్వరస్వామివారి మహాశివరాత్రి సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

నాంపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లోవున్న అతివురాతన శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో శ్రీ సంగమేశ్వరస్వామివారి మహాశివరాత్రి, సప్తదశ వార్షిక బ్రహోత్సవాలు కన్నులపండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, అర్చకస్వాములు తెలిపారు. ఈ నెల 13 శుక్రవారం నుండి 16 సోమవారం వరకు ఆలయ సంప్రదాయానుసారం జరిగే ఉత్సవాల్లో నిత్య హోమం, మహాన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలతోపాటు 13 శుక్రవారం సాయంత్రం 5.30గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, మృత్యంగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపారాధాన, వాస్తుపూజ, వాస్తు హోమం, ధ్వజపటాధివాసము; 14 శనివారం ఉదయం 8.30ల నుండి యాగశాల ప్రవేశం, సోమకుంభ స్థాపన, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమములు, ధ్వజాది హోమం, ధ్వజారోహణం, రాత్రి 7 నుండి భేరిపూజ, భేరి తాండవం, నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి, బలిహరణం, నివేదన; 15 ఆదివారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, 7.30 నుండి రాత్రి 9గంటల వరకు ఏకవార రుద్రాభిషేకములు, అర్చనలు, ఉదయం 9లకు రుద్రహోమం, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, నివేదన, రాత్రి 7లకు నిత్యహోమం, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, రాత్రి 8.30లకు శివకళ్యాణ మహోత్సవం, రాత్రి 11గంటల నుండి లింగోద్భవకాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, అనంతరం రథోత్సవము; 16 సోమవారం ఉదయం 9లకు అన్నాభిషేకం, 10.30 లకు మహాపూర్ణాహుతి, ధ్వజాపరోహణం, 11లకు త్రిశూల స్నానము, కుంభ ప్రోక్షణ, మధ్యాహ్నం 12లకు నివేదన, నీరాజనం, మంత్రపుష్పము, ఆశీర్వచనం, వేదపండిత సత్కారం, తీర్థప్రసాద వితరణలతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయని వారు వివరించారు. అధికసంఖ్యలో భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించి సేవించి శ్రీ సంగమేశ్వరస్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రెండేళ్ల సుధీర్ఘ పోరాటం.. ఫలించిన వివేకానందనగర్ బస్తీవాసుల సమస్య

చిక్కడపల్లి ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త) : రెండేళ్ల సుధీర్ఘ పోరాటం అనంతరం గాంధీనగర్ డివిజన్ లోని శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులకు డబుల్ బెడ్ రూమ్ లు మంజూరు కావడం సంతోషంగా ఉందని స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. ప్రధానంగా తన కార్పొరేటర్ పదవీకాలంలో మంజూరు కావడం మరింత ఆనందాన్ని కలిగించిందని అన్నారు. శనివారం వివేకానందనగర్ బస్తి వాసులకు ఇళ్లపట్టాలకు సంబంధించి సానుకూల నిర్ణయం వచ్చిన సందర్భంగా సంబురాలు చేసుకున్నారు. రెండేళ్లు గా బాధితులకు అండగా ఉంటూ,అనేక సార్లు ప్రభుత్వ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ,ఎంఆర్ఓ ల వద్దకు బిజెపి ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ ఎం పి డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రత్యేక చొరవ చూపడం, ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సహకరించడం మూలంగానే సాధ్యమైందని పావని వినయ్ కుమార్ అన్నారు. ఎట్టకేలకు బాధితులకు డబుల్ బెడ్ ఇళ్లు మంజూరు కావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వరుసగా కలెక్టర్ తో సమీక్షిస్తూ, అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఇళ్ళు మంజూరు చేయించిన

సంబురాలు జరుపుకుంటున్న వివేకానందనగర్ బస్తీ వాసులు

అనంతరం శనివారం కలెక్టర్ ఆమోదంతో, ముషీరాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో పట్టాల ప్రోసీడింగ్ ప్రక్రియను బస్తీ వాసులు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ వాసులతో కలిసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ,శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీ అధ్యక్షుడు ఎన్. ఏళ్ళమ్, ఎం బి.కృష్ణ,నందు, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావు, బలరాజ్,ఎల్చమ్మ,జయలక్ష్మి, అన్నపూర్ణ, సువర్ణ,భారతి, కన్యాకుమారి, బస్తీ వాసులందరూ పాల్గొన్నారు.

అంబేద్కర్ రమాబాయికి ఘననివాళి

అంబేద్కర్ రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థినులకు టిఫిన్‌బాక్సులను అందచేస్తున్న దృశ్యం

గోషామహల్,ఫిబ్రవరి 7ప్రభాతవార్త:భారత దేశం బహుజన బిడ్డల భవిష్యత్తు కోసం తమ బిడ్డలను త్యాగం చేసిన మహనీయురాలు క్రాంతికారి మాత అంబేద్కర్ రమాబాయి అ

అవగాహన అప్రమత్తతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య కోరారు. శనివారం తీగలకుంటలోని పోనిక్స్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై బ్యానర్లు, వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహనతోపాటు అప్రమత్తత అవసరమన్నారు. విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి తెలుసుకొని తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో మొబైల్ వినియోగం, సామాజిక మాధ్యమాల వాడకం పెరిగిపోయిందన్నారు. సైబర్ నేరగాళ్లు లింకులు, మెసేజ్‌లు, ట్రేడింగ్, ఆధార్ అప్డేట్, ఏపీకె ఫైల్స్, ట్రాఫిక్ ఛాలాన్ల పేరుతో రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అనుమానిత లింకులు, సందేశాలను ఎట్టి పరిస్థితుల్లో తెరవద్దని తెలిపారు. పోలీసుల అన్‌లైన్, డిజిటల్ అరెస్టులు ఉండవని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే వెంటనే 1930కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హసీనా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులు అందజేత

మహిళలకు బహుమతులు అందిస్తున్న మర్రి పురురవారెడ్డి.

బేగంపేట ఫిభ్రవరి 7,ప్రభాతవార్త

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని,వారి శక్తి ఎంతో గొప్పదని బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి పురురవారెడ్డి అన్నారు .ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం 2026లో భాగంగా శనివారం బేగంపేట పాటిగడ్డ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో మహిళలకు మ్యూజికల్ ఛైర్స్‌పోటీలు నిర్వహించారు.ఈ పోటీలకు ముఖ్య అతిథిగా మర్రి హాజరయ్యారు.ఈ పోటీలలో విజయం సాధించిన మహిళలకు మొదటి,రెండవ బహుమతులను ఆయన అందజేసారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన మహిళలకు గిఫ్టులు,పార్టిసిపేట్ సర్టిఫికెట్లను అందజేసారు.ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ మహిళలు ఎంతో శక్తి వంతులని,ఒక వైపు గృహిణులుగా ఉంటూనే మరో వైపు వివిధ రంగాల్లో వారు తమ ప్రతిభను చూపుతారని,స్వశక్తితో ఎదిగేందుకు వారు ఎంతో ఆసక్తి చూపుతారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ.దయానంద్,బీజేపీ మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్,బీజేపీ డివిజన్ అధ్యక్షులు యం.మహేష్ కుమార్ మహిళా మోర్చా నాయకురాలు సంధ్యాలక్ష్మి,డివిజన్ ప్రధాన కార్యదర్శి తారకం పేట శ్రవణ్,నాయకులు నగేష్,వేణు, గణేష్,స్వప్న గుప్త, అనిత,బాబురావు,మహేష్,లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే ముఠా గోపాల్

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు ఆయన అందచేశారు. ఈ సందర్భంగా 68 కళ్యాణ లక్ష్మి చెక్కులు, 56 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్, యూత్ కాంగ్రెస్ నేత ఎం.అరవింద్ కుమార్ యాదవ్(టిల్లు) బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎం.రాకేష్‌కుమార్, వై.శ్రీనివాస్, కొండ శ్రీధర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

హైటెన్షన్ రోడ్డుకు మోక్షం: కార్పొరేటర్ జితేందర్‌నాథ్

సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం 4.50 కోట్లుతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నిధులు మంజూరు చేయించడంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సహకారం ఎనలేనిదని ఆయన తెలిపారు. ఓల్డ్ అల్వాల్ విబిఆర్ గార్డెన్స్ నుంచి ఎస్ఎన్ రెడ్డి కాలనీ వరకు హైవేని కలిపే ఈ రోడ్డు సంవత్సరాలు కాలంగా గుంతలు మయంగా ఉంది. ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి మోక్షంలభించడంతో స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడం దారుణం

సైఫాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

నాడు దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీని మతోన్మాది నాథురం గాడ్సే ఆర్ఎ స్ఎస్ ప్రోత్సహంతో హత్య చేయడం జరిగిందని, నేడు దేశంలోని పేదలకు గాంధీ పేరుతో ఉపయోగపడే ఉపాధి హామీ పథకం పేరును తీసేసి అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం దారుణమని ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి ఆరోపించారు. గాంధీ పేరును తీసివేసినంత మాత్రాన ఆయన చేసిన సేవలను ప్రజలు మ ర్చిపోలేరని స్పష్టం చేశారు. ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఉపాధి హామీ పథకం పేరును మహాత్మాగాంధీ పేరిట కొనసాగిం చాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో పిడమర్తి రవి మా ట్లాడారు. దేశవ్యాప్తంగా మహానీయుల పేర్లను తొలగించడం, రాజీవ్‌గాంధీ పిలోషిఫ్‌ను యూజిలో కలపడం పేదలకు అన్యాయం చేయడమేనని ఇది బిజెపి చేస్తున్న పని దీనిని అందరూ ఖండించాలని ఆయన కోరారు. రానున్న రోజుల్లో దేశంలో బిజెపి అగడాలు ఎక్కువై బడుగు బలహీనవర్గాల పేదలను బ్రతకనీయకుండా చేస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లోప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని మాట్లాడనీయకుండా చేయడం సిగ్గుచేటని ఆయన అధికార పక్షంపై తీవ్రంగా విమర్శించారు.

జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

-ఈనెల 17 నుండి 25 వరకు బ్రహ్మోత్సవాలు

-ఏర్పాట్లను సమీక్షించిన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్ ఫిబ్రవరి7: జూబ్లీహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఆలయ బ్రహోత్సవాలు ఫిబ్రవరి 17 నుండి 25వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. గోడ పత్రికలను, ఆహ్వాన పత్రికలను శనివారం జూబ్లీహిల్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు.ఆలయ వార్షికోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలని కోరారు. చలువ పందిళ్లు, క్యూ లైన్లు, తాగునీరు, అన్నప్రసాదాలు, పటిష్ట సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎస్వీ ఆలయ ఎల్.ఏ.సి ప్రెసిడెంట్ ఏవి రెడ్డి, ఏఈవో రమేశ్, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ నిరంజన్, హరికృష్ణ, పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు. ఈనెల 10న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఉంటుందని, ఈ సందర్భంగా తెల్లవారు వేకువ జూమున స్వామివారిని మేల్కొలిపి, అనంతరం ఆగమోక్తంగా కార్యక్రమాలు చేపడుతారు. ఉదయం 07.00 గం.ల నుండి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడుతారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు.

బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఇతర సభ్యులు.

అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 11 గం.ల నుండి సాయంత్రం 05.00 గం.ల వరకు సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు.ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. 25న బ్రహోత్సవాలు ముగిసిన తర్వాత 26న మధ్యాహ్నం 3 గంటలకు పుష్పయాగం చేస్తారు. ఉత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిరోజు వాహనసేవల ముందు కోలాటాలు,భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించనున్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎస్వీ ఆలయ ఎల్.ఏ.సి అధ్యక్షుడు ఏ.వి. రెడ్డి, ఏఈవో రమేశ్, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ నిరంజన్, హరికృష్ణ, పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

సీవరేజ్ పైప్‌లైన్ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: పద్మారావు నగర్ లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో చాలా వరకు పరిష్కరించినట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం పద్మారావు నగర్ పార్క్ సమీపంలో ని రీనీది వద్ద 43 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, మెయిన్ రోడ్లు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, వాటర్ లైన్ ల అభివృద్ధి, పార్క్ ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పద్మారావు నగర్ పార్క్ కు వచ్చే వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించినట్లు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం నా బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, కవాడిగూడ దీది పుష్పలత, వాటర్ వర్క్స్ బిలీ వినోద్, డీబీలీ ఆశిష్, పద్మారావు నగర్ డివిజం బి ఆర్ ఎస్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు సాదం బాలరాజ్ యాదవ్, అంబులెన్స్ సురేష్, లక్ష్మీపతి మహేందర్ గౌడ్, ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, రమణ, కొత్తూరు వెంకట్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రమాబాయ్ అంబేద్కర్ జయంతి

రమాబాయ్ అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నేతలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో రమాబాయ్ అంబేద్కర్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు ఎడ్ల రుద్ర మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత సహచరిగా, ఆయన జీవితంలో, భారత రాజ్యాంగ నిర్మాణంలో, చేసిన ప్రతి పోరాట, హక్కుల ఉద్యమ ఘట్టాల్లో ఆమే చేసిన త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. తన భర్త చదువుకు పిడకలమ్మి, పస్తులుండి పైస పైసా కూడబెట్టి పంపడం ఒక భాగమైతే, తన కుమారులు కండ్ల ముందే చనిపోతున్న ఆ కడుపుకోతను, పుట్టెడు దుఃఖాన్ని కడుపున దిగమింగుకుని ఆన్ని తానై ముందుకు నడిపిన ధీశాలి అని కొనియాడారు. .నేను చీకట్లో బతుకుతున్న రేపటి తరాలకు వెలుతురు రావాలంటే నువ్వు బాగా చదవాలి అంటూ మానసిక, కుటుంబ, ఆర్థిక, సమాజ ఇబ్బందులు తన ధరికి చెరనీయకుండ బాబాసాహెబ్ ను నడిపించిన ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ నగర్ డివిజన్ ఉపాధ్యక్షులు దేవేందర్ మాదిగ, అలీ భాయ్, బొల్లు శ్రీనివాస్, తుమ్మల శివప్రసాద్, సూరారం సుజాత, వెంకటేష్, కృష్ణంరాజు, నవాజ్ పాల్గొన్నారు.

పాతబస్తీలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మిక పర్యటన

అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : జీహెచ్ యంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు.చార్మినార్ సర్కిల్ పరిధిలోని చారిత్రక చార్మినార్, మక్కా మసీద్ కట్టడాలు, హిమ్మత్‌పురా, శాలిబండ మెయిన్ రోడ్డు, ఆశ టాకీస్ ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులు, ప్రధాన రోడ్లపై పారిశుద్ధ్య నిర్వహణ గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చారిత్రక కట్టడాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. శాలిబండ ఆశా టాకీస్ రహదారిలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి నిర్మాణ పనులలో జాప్యం లేకుండా అన్నీ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పూరి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత, ఇంజనీరింగ్ విభాగం ఈఈ షేక్ సన్నావుద్దీన్, ఎస్‌డబ్ల్యూఎం డిఇ శ్రీరాములు, పలు విభాగాల డిఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమస్ఫూర్తి మరిచిపోలేనిది

: ఉద్యమనేత సంపతి మాధవరెడ్డి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

తెలంగాణ మలివిడత పోరాటం చిరస్థాయిగా ప్రజల హృదయాలలో నిలుస్తుందని తెలంగాణ ఉద్యమనేత సంపతి మాధవరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రాబోయేకాలంలో ఉద్యమకారులకు సముచినతస్థాయం కల్పించకపోతే ఉద్యమించడం ఖాయమని ఆయన హెచ్చరించారు. శనివారం చింతల్ హెచ్ఎంటి గ్రౌండ్స్ శ్రీ నల్లపోచమ్మదేవాలయ ఆవరణలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గస్థాయి ఉద్యమకారులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యమకారులకు సముచినతస్థానం జిహెచ్ఎంసి ఎన్నికల్లో తగిన వాటా కల్పించి గుర్తింపునివ్వాలని వారు డిమాండ్‌చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా ప్రతి ఉద్యమ కారుడికి 250 గజాల ఇళ్లస్థలం, గుర్తింపుకార్డు, ఆరోగ్య రక్షణ కార్డు, వెంటనే మంజూరీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కస్తూరి బాల్‌రాజ్, మహ్మద్‌గౌసొద్దీన్, గుమ్మడి మధుసూధన్ రాజు, లక్ష్మణ్‌గౌడ్, చిలుకా సతీష్, మేడి చంద్రశేఖర్, సురేశ్‌గౌడ్, సుధాకర్, జెఎసి నాయకులు ముదిరెడ్డి అశోక్‌రెడ్డి, డాక్టర్. శివరాత్రి యాదగిరి, రవిందర్‌గుప్తా, పప్పిరెడ్డి సురేందర్‌రెడ్డి,రవిందర్ ముదిరాజ్ వాచ్‌పాయ్‌నగర్ వెంకటేశ్, సాంభయ్యపాల్గొన్నారు.

నృత్యకళాకారులకు సంగీత సాహిత్యాల్లో ప్రావీణ్యం ఉండాలి

-తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు

నాంపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : నృత్యకళాకారులకు సంగీతం, సాహిత్యంలోనూ తగిన ప్రావీణ్యత ఉండాలని, అప్పుడే వాళ్లు సంపూర్ణంగా రాణిస్తారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు అన్నారు. సిద్ధ నాట్యకళాసమితి ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో శనివారం జరిగిన కూచిపూడి నాట్యం సర్టిఫికెట్ పరీక్ష మూడవ, నాలుగవ సంవత్సరం, డిప్లొమా విద్యార్థులకు సిద్ధాంతం, ప్రాయోజిక అంశాలపై డా. కె.అనిత సమన్వయంలో నిర్వహించిన కూచిపూడి నాట్యశాస్త్ర సమీక్ష-3 సదస్సులో నిత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూచిపూడి నాట్యం అభ్యసించే సర్టిఫికెట్, డిప్లొమా విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, నృత్య విద్యార్థుల వయస్సు ఆధారంగా సిలబస్‌ను రూపొందించాలని ఆయన పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షురాలు వాణిరమణ స్వాగతోపన్యాసం అనంతరం నృత్యగురువులు వేదాంతం రామలింగశాస్త్రి, జొన్నలగడ్డ అనురాధ, ఆర్.ప్రసన్న రాణి, కె.యామిని యశోద, వేలూరి సుమిత్ర తదితరులు ఈ సదస్సులో మాట్లాడుతూ యువ నృత్యకళాకారిణులకు, గురువులకు కూచిపూడిలో ఉన్న ప్రముఖ బాణీలు, దరువు ప్రాధాన్యత, పలు పాఠ్యాంశాలపై విలువైన సూచనలు చేశారు. నాట్యగురువులు భాగవతుల సేతురాం, వనజ ఉదయ్, పసుమర్తి ఉదయ్‌భాస్కర్‌లు కూచిపూడి నాట్యగురువులందరినీ ఒకే వేదికకు ఆహ్వానించి ఎంతో ఉపయుక్తమైన సదస్సును నిర్వహిస్తున్న సిద్ధనాట్య కళాసమితిని అభినందించారు. ఎన్.శ్రీలత వందన సమర్పణతో సదస్సు విజయవంతంగా ముగిసింది.

కూచిపూడి నాట్యశాస్త్ర సమీక్షా సదస్సులో పాల్గొన్న నిత్యానందరావు, రామలింగశాస్త్రి, అనురాధ, ప్రసన్నరాణి తదితర నాట్యగురువులు

బేగంపేట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన

బేగంపేట ఫిభ్రవరి 7,ప్రభాతవార్త

బేకరీ గల్లీలో రోడ్డు పనులకు శంఖుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి.

బేగంపేట డివిజన్ ను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఎంతో అభివృద్ధి చేసానని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు.శనివారం బేగంపేట డివిజన్ పరిధిలోని మయూరి మార్గ్, అల్లంతోటబాయిలలో ఆమె వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసారు.మయూరి మార్గ్ లో నల్లపోచమ్మ ఆలయం పక్క గల్లీ,ఎస్‌బీఐ ఏటీఎం పక్కగల్లీ,బేకరీ గల్లీ,సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాలు గల్లీ,అంగన్‌వాడీ పాఠశాల పక్క గల్లీలో రూ 38లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ భూమి పూజ చేసారు.శ్రీనిలయ అపార్ట్‌మెంట్ పక్క గల్లీలో నిల్చిపోయిన వర్షపు నీటిని తరలించేందుకు డీజీల్ ఇంజిన్ కోసం 24లక్షల 50వేలు,హనుమాన్ ఆలయం గల్లీలో మరో 24లక్షల 50వేలతో పనులు చేపట్టేందుకు ఆదివారం శంఖుస్థాపన చేసారు.వీలైనంత త్వరగా పనులను పూర్తి చేస్తామని,పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని కార్పొరేటర్ మహేశ్వరి తెలియజేసారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, పొన్నబోయిన సురేష్ కుమార్ యాదవ్,నాగు రఘునాథ్,నరేష్, ఆరిఫ్,జాండ్లకృష్ణ, మధుసూధన్‌రెడ్డి, రామ్‌చందర్,మాణిక్,బాబా అహ్మద్ హుస్సేన్,బంగారు శ్రీనివాస్,రాజు,ప్రవీణ్, భరత్ యాదవ్,నవీన్,అమీర్,బాలరాజ్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

జూపార్కులోని ఖడ్గమృగాన్ని దత్తత తీసుకున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :

జూపార్కులోని ఖడ్గమృగం

హైదరాబాద్ పాతబస్తీ నూర్‌ఖాన్ బజార్‌లోని ఫోకస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జూపార్కులోని ఖడ్గ మృగాన్ని మూడు నెలలు పాటు దత్తత తీసుకున్నారు.ఫోకస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఖడ్గమృగం దత్తత కోసం 30 వేల రూపాయలు జమ చేశారు.ముప్పై వేల రూపాయల చెక్కును జూ పార్కు క్యూరేటర్ జె.వసంతకు ఫోకస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు,పాఠశాల యాజయాన్యం కలిసి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫోకస్ హైస్కూల్ అధినేత సయ్యద్ ముస్తాఫా హుస్సేన్‌తో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అద్భుతమైన కళ హరికథ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

హరికథాగానం చేస్తున్న భగవతారిణి నాయని కృష్ణకుమారి

అద్భుతమైన ప్రాచీనకళారూపం హరికథ అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నూతి రామమోహనరావు అన్నారు. శనివారం రాత్రి శృంగేరి శంకరమఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని 'హరికథా మహోత్సవాల'లో భాగంగా నాయని కృష్ణకుమారి (ప్రొద్దుటూరు) భగవతారిణిచే 'భక్త కుచేల' హరికథాగాన కార్యక్రమం అద్భుతంగా సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ జస్టిస్ నూతి రామమోహనరావు పాల్గొని హరికథ విశిష్టత గురించి ప్రసంగించారు. కిన్నెర ఆర్ట్స్, డాక్టర్ కె.వి.రమణాచారి సంపూర్ణ సహాయ సహకారాలతో హరికథ కళా ప్రక్రియకు వేదిక కల్పిస్తున్నారని అభినందించారు. వేదిక పై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి.రమణాచారి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, హరికథా పరిశోధకురాలు డాక్టర్ ప్రభల జానకి, హైదరాబాద్ జిఎస్టి అడిషనల్ కమీషనర్ దాసరి బాలయ్య, కిన్నెర సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, రాధాకృష్ణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బావూనగర్‌లో సివరేజ్ సమస్యకు పరిష్కారం

సివరేజ్ సమస్యను పరిష్కరిస్తున్న మల్లికార్జున్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: అంబర్‌పేట డివిజన్‌లో బాపూనగర్ ప్రజలు తీవ్రమైన సివరేజ్ సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం బిఆర్ఎస్ ఉద్యమ నేత మల్లికార్జున్‌యాదవ్ జోక్యం చేసుకుని జిహెచ్ఎంసి సిబ్బంది సహకారంతో సమస్యను పరిష్కారించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేష్‌యాదవ్, క

చైతన్యనగర్‌లో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

-సిసి కెమెరాలు ప్రారంభించిన కార్పొరేటర్, సిఐ మహేష్

సి.సి.రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం. ఫిబ్రవరి.7.ప్రభాతవార్త : బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో నూతన సి.సి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన మరియు కాలనీలో 32 సిసి కెమెరాలు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ,వనస్థలిపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని.. ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని.. సీసీ కెమెరాలు మరింత భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పిస్తాయని తెలిపారు. రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఎస్ఐ అనిల్ రెడ్డి , గౌతమ్ ,కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి,, కాలనీ మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, జలంధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి యాదయ్య, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎల్లమ్మ ఆలయ చైర్మన్ శివకుమార్, మాజీ చైర్మన్ రామ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జయరావు, చంద్రశేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, అశోక్ కుమార్, కృష్ణారెడ్డి మరియు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం

మల్కాజిగిరి జనవరి7,ప్రభాతవార్త

గౌతమ్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నానని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ మూడు కమాన్ల వద్ద 42 లక్షల రూపాయలతో నిర్మించ తల పెట్టిన బాక్స్ నిర్మాణ పనులను మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గత ఐదు సంవత్సరాల కాలంగా అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో అధికారులు,బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాప్రాల్‌లో డ్రైనేజీ పనులు తక్షణమే మంజూరు చేయాలి : కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త

యాప్రాల్ పరిధిలోని రామ హౌసింగ్ కాలనీ, సాయి కృష్ణ ఫేజ్-2 కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి స్పందించారు. కాలనీ సభ్యులతో కలిసి హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ ఎస్‌బి, జీహెచ్ ఎంసీ మ్యానేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఐఏఎస్‌ను కలిసి సమస్యలను వివరించారు.మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అందించిన రిఫరెన్స్ లేఖ ఆధారంగా రెండు కాలనీలలో డ్రైనేజీ పనులకు తక్షణమే మంజూరు చేయాలని ప్రతిపాదించారు. డ్రైనేజీ సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని తెలిపారు.అదేవిధంగా, నేరెడ్‌మెట్, యాప్రాల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్త ప్రతిపాదనలలో అత్యవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు కూడా అవసరమైన మంజూర్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కొతపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, శ్యామ్, అకారం సాయి, సునంద, సతీష్, జయప్రకాశ్, శుభ మీనన్ పాల్గొన్నారు.

జెకె కాలనీలో బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభం

వినాయక్ నగర్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని జె.కె కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో అడుగు పడింది. కార్పొరేటర్ నిధుల నుండి రూ.1.32 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు.కాలనీలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం, డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే కాలనీలో వర్షపు నీరు, మురుగు నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు టిల్లు యాదవ్, రాము యాదవ్, సాయి సురేష్, దరమేష్ యాదవ్, లత, ఝాన్సీ, దీపక్ తదితరులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

గుర్రంగూడ ప్రధాన రోడ్డులో అటవీశాఖ ప్రహరీగోడ నిర్మాణ యత్నాలు

-సెట్ బ్యాక్ లేకుండానే తవ్వకాలపై గ్రామస్తుల అభ్యంతరం

-శంషాబాద్ జోనల్ కమిషనర్ దృష్టికి తెచ్చిన నాయకులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ డివిజన్ కిందకు వచ్చే గుర్రంగూడ గేట్ నుండి గ్రామానికి, వివిధ కాలనీలకు వచ్చే ప్రధాన రోడ్డు పక్కనే ఎలాంటి సెట్ బ్యాక్‌లకు లేకుండా ఫారెస్టు అధికారులు ప్రహరీగోడను నిర్మిస్తుండడం వివాదాస్పదమవుతున్నది. నాగార్జునసాగర్ రహదారి నుండి గుర్రంగూడ లోకి వచ్చే ఏకైన మార్గం ఈ రహదారే కావడంతో గ్రామస్తులు, వివిధ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిఎన్‌రెడ్డినగర్ దాటిన తర్వాత ఇంజాపూర్ వైపు వెళ్లే మార్గంలో నాగార్జున సాగర్ రోడ్డుకు ఆనుకొని ఉన్న గుర్రంగూడ గేట్ నుండి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన అటవీ శాఖ అధికారులు ప్రహరీగోడ నిమిత్తం గోతులు తీసే పనులు ప్రారంభించారు. అయితే 120 ఫీట్ల మేర వెడల్పు ఉండాల్సిన రోడ్డు ఇరుకుగా మారుతుందనీ దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను వెడల్పుగా ఉంచాల్సిన ప్రభుత్వ శాఖ అధికారులే రోడ్డును తక్కువ చేసే ప్రయత్నాలపై స్థానిక గుర్రంగూడకు చెందిన వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, కాలనీ సంక్షేమ సంఘాలు, కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూమి ఎవరిదైనా రోడ్డు మాత్రం కచ్చితంగా వెడల్పు ఉండాల్సిందేనని వారు స్పష్టం చేస్తున్నారు. కాగా గ్రామస్తుల అభ్యంతరం మేరకు తాత్కాలికంగా ప్రహరీగోడ నిర్మాణపు పనులు నిలిచిపోయాయి.

గుర్రంగూడలో ప్రధాన రోడ్డు పక్కన ప్రహరీగోడ కోసం అటవీ శాఖ అధికారులు తవ్విస్తున్న గోతులు

శంషాబాద్ జడ్‌సికి వినతి పత్రం ఇచ్చిన గ్రామస్తులు

కాగా గుర్రంగూడ ప్రధాన రోడ్డులో అటవీశాఖ అధికారులు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న ప్రహరీగోడ విషయమై గ్రామస్తులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, జక్కిడి శ్రీరాంరెడ్డి, పల్స రాఘవేందర్‌గౌడ్, కొండా శ్యామ్‌సుందర్‌రెడ్డి, జక్కిడి సురేందర్‌రెడ్డి, జక్కిడి మారుతీరెడ్డి, జక్కిడి వెంకట్‌రెడ్డి, గుర్రం దిలీప్‌రెడ్డి తదితరులు శనివారం శంషాబాద్ జోనల్ కమీషనర్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం చిన్నగా ఉన్న రోడ్డు అటవీ శాఖ ప్రహరీ గోడ నిర్మాణం వల్ల ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని వారు జడ్‌సి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ప్రహరీగోడ నిర్మాణ విషయంలో తలెత్తిన సెట్ బ్యాక్ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి : వీరయ్య

తుర్కయంజాల్ జనవరి7,ప్రభాతవార్త

కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, బివిజి, రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసిలో 100 విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 2026 ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ పరిధిలో ఉన్నటువంటి డాల్చిన్ ఫుడ్స్ ఇండియా లిమిటెడ్, కాన్ కార్డ్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కార్ బేకర్స్ ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పరిశ్రమల్లో కార్మికులను నేరుగా కలిసి దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలు, బుక్ లెట్స్ పంచుతూ సభలు, గేట్ మీటింగ్ లు పెట్టి విస్తృతంగా ప్రచారం చేశారు.ఈ కార్యక్రమానికి సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికుల్ని నిరాయుదులను చేసి పెట్టుబడుదారులు పారిశ్రామికవేత్తలు కార్పొరేట్లకు బంగారు పళ్లెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు సిద్ధమైందని అన్నారు కార్మికులకు మరణ శాసనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్మిక వర్గమే తిరిగి పోరాడి సాధించుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కవిత రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, నాయకులు పీ శ్రీనివాసులు, బి మాల్యాద్రి, ఇల్లూరి భాస్కర్, ఐతరాజ్ కృష్ణ, బడుగు శంకరయ్య, నరసింహ, బాబు, యాదగిరి చారి, తదితరులు పాల్గొన్నారు.

ఆదం సంతోష్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

తార్నాక, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ పలువురు బీఆర్ఎస్, ఇతర నాయకులు ఆ పార్టీకి షాక్ ఇచ్చి కాంగ్రెస్‌లో చేరారు. మణికేశ్వర్ నగర్‌లో కు చెందిన కాంగ్రెస్ నాయకులు, వడ్డెర ఓబన్న ఉత్సవ కమిటీ మెంబర్, ఎంకె నగర్ అధ్యక్షులు గండి కోట కుమార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజక వర్గం ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ సమక్షంలో సాయంత్రం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండాలు, పార్టీ నినాదాలతో మణికేశ్వరీనగర్ మొత్తం కాంగ్రెస్ మయంగా మారింది. ఈ సందర్భంగా అదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అందుకే ప్రజలు కాంగ్రెస్ వైపు విశ్వాసంతో ముందుకు వస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ప్రతి డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి, రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గండికోట కుమార్ మాట్లాడుతూ మణికేశ్వర్ నగర్‌లో జరిగిన భారీ జాయినింగ్‌లు కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు తమపై ఉన్న నమ్మకానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బస్తీ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన విభాగ ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో వేబుల గణేష్, ఆలకుంట మల్లికార్జున్, గండికోట కుమార్, సిరుసు వెంకటేష్, ఒర్సు నరేష్, ఆటో అసోసియేషన్ నాయకులు, కంప్రెషన్ అసోసియేషన్, ఆలకుంట సొసైటి, దక్షిణాది సంఘం, త్రిశక్తి యూత అసోసియేషన్, సితారామా రాజు అసోసియేషన్ నాయకులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో ఇంచార్జి ఆదంసంతోష్ కుమార్

శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం కమిటి ప్రమాణ స్వీకారం

రామంతాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : రామంతాపూర్‌లోని ప్రసిద్ధ శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ కమిటి ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం చైర్మన్‌గా శాగ శ్రీధర్, సభ్యులుగా చిటికెల కృష్ణయ్య, ముదిగొండ అరుణ్ సాయి, శేఖర్ పంతులు, సీమకండ్ల జంగయ్య, శిరీష్ గౌడ్, కాసరేల్ల శేఖర్ రెడ్డి, మెంగ శోభ నియమితులైయ్యారు. నూతన కమిటి సభ్యులతో దేవాదాయశాఖ అధికారులు ప్రణీత్, ఈవో సురేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగి రెడ్డి, మహ్మద్ తౌఫిక్, ఎండి.రఫిక్, మేడిపల్లి విశాల్ రెడ్డి, నామ్ రాజి రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, కంది శ్రావణ్ రెడ్డి, బొడ్డు పల్లి రవి, జలీల్ పాషా, శామ్యూల్, ముత్యాల జంగయ్య, ముత్యాల బాబు, పెద్దిరాజు సందీప్ కుమార్, పంతులూరి భాస్కర్, సతీష్ గౌడ్, శిరీష్ గౌడ్, విజయ్, కె. స్వామి, కాశీం గౌడ్, నాగమల్లయ్య, కాశమల్ల శంకర్, శంక ర్ గౌడ్, బెస్త భాస్కర్, చింటూ, సచిన్, సలీం, రామ్ రాజు,నయీం, మెంగా రవి, సంతోష్, పెంటయ్య, యాద గిరి రెడ్డి, జంగా రెడ్డి, సంధ్య రాణి, అంబిక, గాయత్రి పాల్గొన్నారు.

శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం ప్రమాణస్వీకారోత్సంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

అట్టహాసంగా 40 వసంతాల సంబరాల్లో క్రీడా కేళి

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త : నాలుగు దశాబ్దాల విద్యా సేవను పూర్తి చేసుకున్న హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5, 6, 7 తేదీలలో పాఠశాల, ఇంటర్మీడియట్, బీఎస్సీ, బీకాం, ఎంఎస్సీ, బీఈడీ (హెచ్ఐ) విద్యార్థులకు విస్తృత స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.ఈ పోటీలను 5, 6 తేదీలలో ఈసీఐఎల్ క్రికెట్ గ్రౌండ్‌లో, 6, 7 తేదీలలో భవన్స్ డిగ్రీ కాలేజీ క్రికెట్ మరియు స్పోర్ట్స్ గ్రౌండ్‌లలో నిర్వహించారు. జూనియర్ బధిర విద్యార్థుల కోసం కోకో, కబడ్డీ, టెన్నిస్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్ వంటి పోటీలను ఏర్పాటు చేయగా, సీనియర్ విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు.విజేతలకు ఐబీఎం కార్పొరేట్ సంస్థ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఐబీఎం సీనియర్ మేనేజర్ అనిల్, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ నిరంజన్ ప్రసాద్, భవన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, సంస్థ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ పటాన్ ఉమర్ ఖాన్, డాక్టర్ ఆరుముగం, డాక్టర్ శశిధర్ రెడ్డి, ప్రొఫెసర్ అంజయ్య, శ్రీధర్, శ్రీనివాస్, శైలజ, లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సమక్షంలో కార్యక్రమం విజయవంతమైంది.ఈ నెల 14న జరగనున్న 41వ ఫౌండేషన్ డే సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని ఈ క్రీడా పోటీల్లో బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థి విజయ భాస్కర్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కబడ్డీ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలలో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. సాధారణ విద్యార్థులతో సమానంగా పోటీపడి అందరి ప్రశంసలు అందుకొని ఈ క్రీడా మహోత్సవంలో హీరోగా నిలిచాడు.

ఉల్లి రైతుల సంక్షేమానికి కృషి : అధ్యక్షుడు చేగురీ వెంకటరమణ

మలక్ పేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: ఉల్లి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ అసోసియేషన్ కార్యా లయంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ ఆధ్వర్యంలో ఉల్లిపాయ రైతులు, ఉల్లి వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందుల గురించి ఉల్లి వ్యాపారస్తులతో సమావేశాన్ని నిర్వహించి పలు అంశాల గురించి చర్చించారు. వర్షా బావ పరిస్థితుల మూలంగా కొద్ది నెలల నుంచి మన రాష్ట్రంలోని మహబూబ్ నగర్, నారాయణఖేడ్, కొల్లాపూర్ జిల్లాలతో పాటు కర్నూలు, రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి ఉల్లి సరుకు మార్కెట్ కు రాకపోవడంతో సరైన ధరలు రావడంలేదని, అదేవిధంగా మహారాష్ట్ర లో కూడా కొంత ఉల్లి పంట దెబ్బతినడంతో ఉల్లి సరుకు మార్కెట్ కు రావడంలేదని దీంతో ఉల్లిపాయలకు సరైన ధర లేకపోవడంతో ఉల్లి రైతులు, ఉల్లి వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఉల్లి రైతులకు సరైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదారం కృష్ణ, దుగ్గ జగదీష్, ఉల్లి వ్యాపారస్తులు మైల రవికాంత్, సురేష్, వెంకటేష్, అనిల్ , శంకర్రావు, సత్యలింగం, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ తదితరులు

మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం

మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం ఐలయ్య , సెక్రటరీ డాక్టర్ విజయ్ కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాం తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ సిటీ, మలక్ పేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఎంఎన్ జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం ఐలయ్య , సెక్రటరీ డాక్టర్ విజయ్ కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాం తదితరులు హాజరయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు సీమ, శ్రీలత , లింగం గౌడ్, సంజయ్ సింగ్ యాదవ్, దామోదర్, మీనాజ్, ధనశ్రీ నాయుడు, పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు జరపాలి

పనులను పరిశీలిస్తున్న అరవింద్‌శర్మ, నగేష్

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం పనులు జరపాలని మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్ విజయవాడ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులను శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అరవిందశర్మ మాట్లాడుతూ వర్షపు, మురుగు నీరు జాతీయ రహదారిపై నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి సుమారు రూ.45 లక్షల నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించారు. త్వరలో పనులు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పనులు పూర్తవుతున్న నేపథ్యంలో కాలనీ, బస్తీవాసులు సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, రామాచారి, సాజిద్, గొడుగు శ్రీనివాస్‌ముదిరాజ్, కొంద్ర శ్రీనివాస్, రామ్‌నర్సింహగౌడ్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, వాజిద్‌పటేల్, రమేష్‌కురుమ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ రామకృష్ణ

కుషాయిగూడ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త...

కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో ఆదివారం అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ విద్యుత్ రామకృష్ణ తెలిపారు. 33/11 కేవీ కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి నాగార్జున నగర్ ఫీడర్ పరిధిలో ఇండస్ట్రియల్ ఏరియా క్యాంటీన్ ఏరియా సీతారాం నగర్ వెంకటేశ్వర స్వామి టెంపుల్ శశికాంత్ నగర్ షటిల్ కోర్ట్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అదేవిధంగా ని నార్త్ కమల నగర్ భవాని నగర్ మార్కండేయ నగర్ సుభాష్ చంద్ర నగర్ పరిమళా నగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు, ఇదే క్రమంలో లెవెన్ కె.వి ఇండస్ట్రియల్ క్యాంటీన్ ఏరియా ఫీడర్ పరిధిలో హనుమాన్ నగర్ పౌల్ట్రీ ఫార్మ్ ఇండస్ట్రియల్ ఏర